# తల్లి చెప్పిన - చిన్నకథ

శ్రీమతి తారా రామమూర్తి

"అమ్మా! అమ్మా! నారబ్బరు కనపడటంలేదే. పోయిందమ్మా" అన్నాడు బాబు.

"బాగా వెతికిచూడు ఎక్కడ పెట్టావో!" అన్నది తల్లి.

"అంతా వెతికాను కనిపించలేదే" అని బిక్కమొఖం పెట్టాడు బాబు.

లోపలికి వెళ్ళి పెట్టె తెరచి ఒక అణా తీసుకొచ్చింది తల్లి. "ఇందు బాబూ. నేనొక కథ చెపుతానువింటావా?" అన్నది,

బాబుకి చాలా సంతోష మేసింది. ఒక కథకాదు, పది కథలైనా వినటానికి సిద్ధంగా వున్నాడు.

తల్లి కథ చెప్పసాగింది.

"ఏనుగుని స్నానం చేయించటం చూశావా?"

"లేదమ్మా! నేనెప్పుడూ చూడలేదు."

"దాన్ని దేనితో తోమి స్నానం చేయిస్తారో తెలుసా?"

"సబ్బుతో తోమి సాన్నం చేయిస్తారు కదూ?"

తల్లి నవ్వుతూ! "పిచ్చివాడా ఏనుగుని స్నానం చేయించాలంటే ఎన్ని సబ్బులు కావాలి. చాలా ఖర్చు కదూ, ఎవరు కొనగలరు? అదికాదు. రాయితో తోమి శుభ్రపరుస్తారు. అలాగే మనగాంధీతాత కూడా సబ్బు రుద్దుకోరు. ఒక గతుకుల రాయితో తోముకుని స్నానం చేస్తారు."

"అమ్మా, మరి ఆయనకి వొళ్ళు నొప్పి పుట్టదూ?"

తల్లి బాధగా నిట్టూర్చింది.

"ఆయన బంగారుదేహం మనకోసరం ఎన్నో నెప్పులను ఓర్చుకుంది నాయనా? యీ రాయా ఆయనకి నొప్పి కలిగించేది?"

ఒకరోజు ఆరాయి .... కనపడకుండా పోయింది.

స్వాతంత్ర్యం వచ్చే రోజుల్లో నవకాళి అనే ఒక వూరిలో హిందూ-ముస్లిమ్ పోరాటం జరిగింది. మానవత్వం నసించిన ఆఘోర భయంకర సంఘటనలను విని మన గాంధీతాత కన్నీరు విడిచారు. వెంటనే ఆయన నవకాళీకి ప్రయాణ మైనారు-అక్కడి కలహాన్ని ఆపటానికి, గాంధీతాత సన్నిహితురాలైన "మను గాంధీ" అనే పిల్లకూడా బయలు దేరింది.

అక్కడికి వెళ్ళి ఆ భయంకర కలహాన్ని సమాధానపరచారు.

అక్కడే నారాయణ పురం అనే గ్రామానికి వెళ్ళారు తన శిష్యులతో.

ఆయనకి ఒక అలవాటు వుండేది. బయట తిరిగివచ్చినప్పుడు వేడినీళ్ళతో కాళ్ళు శుభ్రపరచుకుంటేనేకాని వేరే పని చూచేవారు కాదు.

అవునుమరి ఆ కాళ్ళకి ఎన్నిరాళ్ళు ఎన్ని ముళ్ళు గుచ్చుకుని ఎంతబాధ కలిగించేవో?

కాళ్ళు శుభ్రపరచాక వేడినీళ్ళు స్నానానికి సిద్ధపరిచింది, మనుగాంధి.

కానీ ఎంతవెతికినా గాంధీతాత రుద్ది తోముకునే రాయి కనుపించలేదు.

ఆమెకి భయంతో గుండె ఆగినంత పనైంది. ఆరాయి ఏమైనదీ, ఎక్కడ మర్చిపోయినదీ తరచి తరచి ఆలోచించసాగింది. నవకాళీలో మరచినట్లు జ్ఞాపకమొచ్చింది. వెంటనే గాంధీతాత దగ్గరకు పరుగెత్తుకువెళ్ళింది.

"బాబూజీ! బాబూజీ! మీరు తోముకునే రాయి కనిపించలేదు. నిన్న ఆగ్రామంలో మరచినట్లున్నాను" అన్నది దిగులుగా.

గాంధీ తాత కొంచెంసేపు ఆలోచించారు. "అదంతా నాకు తెలీదు, నువ్వు అలా మర్చిపోయి రావటం తప్పు, కనుక, నువ్వేవెళ్ళి ఆ రాయి వెతకి తీసుకురా" అని ఆజ్ఞాపించారు.

ఆ పిల్ల ఎంతోసేపో వేడుకుంది తనకు తోడు ఎవరినైనా పంపమని.

ఆయన దగ్గర అటువంటి వేమీ పనికిరాలేదు.

అడవిమార్గం? ఎక్కడ చూసినా కలహాలు, కక్షలూ భయము మనసంతా ఆక్రమించుకుంది. కానీ ఏంచేస్తుంది పాపం.

రామ రామ రామ రామ రామ అంటూ రామనామ స్మరణ చేసుకుంటూ వంటరిగా నడిచి ఆవూరు వెళ్ళి చేరింది.

పాపం ఎంత అన్యాయం! ఆ రాయి ఆ యింట్లో ఎక్కడా కనిపించలేదు. మరి ఏమైనట్లు?

ఆ యింట్లో ఒక ముసలిది వుంది, దాని కేంతెలుసు ఆ రాయి మహిమ.

ఏదోరాయికదా అని బయట పారేసింది. వూరంతా వెదకివెదకి ఎలాగైతేనేం ఆరాయినితేగలిగిందిమనుగాంధీ.

పొద్దున్న వెళ్ళిన పిల్ల మధ్యాన్నం మండు ఎండలో వచ్చి "బాబూ! ఇదుగోనండీ మీరాయి" అంటూ వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక ఏడిచేసింది.

అప్పుడు గాంధీతాత యిలా చెప్పారు. "నాకూ యీ రాయికీ పాతికేళ్ళ నుండి స్నేహం. నేను జైలుకి వెళ్ళినా గొప్ప భవనానికి వెళ్ళి వుండినా, నాకూడా యీ రాయి వస్తూవున్నది. యీ రాయి కనిపించక పోయివుంటే నా మనసు ఎంతబాధ పడేదో తెలుసా?

మనకి పనికివచ్చే ప్రతీ వస్తువూ. జాగ్రత్తగా పదిల పర్చుకోవటం అలవాటు చేసుకోవాలన్నారు గాంధీతాత."

తల్లి కథ ముగించగానే బాబు ఆలోచనలో మునిగి పోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నది తల్లి.

"ఈ అణా నీ దగ్గరే వుండనీ అమ్మా! ఆ రబ్బరు ఎక్కడవున్నా వెతకి తీసుకు వస్తా" అన్నాడు బాబు.

తల్లి కళ్ళు సంతోషంతో మెరిశాయి! ★


# కాడ్ లివర్ ఆయిల్ తోకూడిన మాల్టు సారము

పుష్ఠికరమైన ఆహారము - మందు కాదు.

ఎ & డి విటమినులతో నిండిన మంచిరకపు కాడ్ లివర్ ఆయిల్ మరియు మాల్టు సారముల నుండి తయారు చేయబడినది. ఈవిశిష్ఠ ఐ.టి.యల్. ఉత్పన్నములో మొలకలెత్తే ధాన్యములందుగల ఆరోగ్యాభివృద్ధి దాయక నియోగములు గలవు.




ఒక ఐ.టి.యల్ ఉత్పన్నము

తయారి:
డి మైసూరు ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరి లిమిటెడ్.
మల్లేశ్వరము - బెంగుళూరు.3

I.T.L.

విక్రయస్థలము:
35/37, తంబుచెట్టి స్ట్రీట్, మద్రాసు - 1

MITZ-5 T9